క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం



సంజీవనగర్ సంపులోకి చేరుకున్న నీరు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, జంగాలపేట కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి ఎద్దడి నెలకొనడంతో కాలనీ వాసులు సమస్యను నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పట్టణానికి సరఫరా అవుతున్న గోరుకల్లు రిజర్వాయర్ పైపులైన్ నుంచి సంజీవనగర్, జంగాలపేట కాలనీకి సరఫరా అయ్యే పైప్‌లైన్‌లకు అనుసంధానం చేసి సంపులోకి నీరు వదిలారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటకు చెందిన షంషద్ వలి(55) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. వ్యాపారాల నిమిత్తం ఆయన హైదరాబాదులో ఉంటున్నారు. ఉదయం వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం తిమ్మనాయినపేటకు తీసుకొచ్చారు. మృతుడు వలికి వైఎస్సార్‌సీపీ నేత, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో పరిచయం ఉంది. ఆయన మృతి విషయం తెలుసుకున్న శిల్పా గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సీహెచ్‌సీలో రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో దాత నాగరాజు యాదవ్ సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధు సుధాకర్‌రెడ్డి, రాజు మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు రవి కుమార్, హరి, వలిబాషా, కేశాలు నాయుడు, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్‌లకు సత్కారం



సత్కారం పొందిన లైన్‌మెన్‌లు

డోన్ టౌన్: జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దివాస్ సందర్భంగా డోన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లను మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయం ఆవరణలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలాకర్ రావు ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈఈ మాట్లాడుతూ.. విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలని.. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం అన్నారు. లైన్‌మెన్‌లు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రవీంద్రవరప్రసాద్, కాటంరాజు, నాగరాజు, కృష్ణామాచారి, కృష్ణారెడ్డి, వెంకటరాముడు, కృష్ణమోహన్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం

బేతంచెర్ల: విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడల్లో పాల్గొనాలని మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్ నాయక్ అన్నారు. మంగళవారం బేతంచెర్ల మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి కుమార్తె చిత్రమ్మ క్రికెట్ బ్యాట్‌లతో పాటు వివిధ క్రీడా సామగ్రి కిట్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు క్రిష్ణారెడ్డి, కమిటీ సభ్యుడు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడి మృతి



విజయ్ యాదవ్(ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలో నివాసం ఉంటున్న బీజేవైఎం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సీసంగుంతల విజయ్ యాదవ్ గుండె సంబంధిత వ్యాధితో సోమవారం మృతి చెందారు. మంగళవారం మృతుని స్వగ్రామం సీసంగుంతలలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అద్దె భవనాలే గతి

- పంచాయతీలకు సొంత భవనాలు కరువు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలు
- సొంత భవనాలు మంజూరు చేయని కూటమి సర్కారు
- సభలు, సమావేశాలు రచ్చకట్టలపైనే..



రామకృష్ణాపురంలో కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్యాపిలి: ఎన్నో దశాబ్దాలుగా సాకారం కాని కొత్త పంచాయతీల కలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. దీంతో ప్యాపిలి మండలంలో అప్పటి వరకు ఉన్న గ్రామ పంచాయతీల సంఖ్య 26 నుంచి 31కి చేరుకుంది. గత ప్రభుత్వం 2021లో కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడంతో ప్యాపిలి మండలంలో అలేబాదుతండా, గార్లదిన్నె, నల్లమేకలపల్లి, రామకృష్ణాపురం, సీతమ్మతండా తదితర గ్రామాలు కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. దశాబ్దాలుగా నెరవేరని కలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేయడంతో ఆయా పంచాయతీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ భవనాలపై దృష్టి సారించకపోవడంతో ఆశలు అడియాసలయ్యాయి.

సొంత భవనాలు లేక పాలనాపర ఇబ్బందులు

2024 జూన్‌లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం కొత్త పంచాయతీల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటిపోయినా పంచాయతీ భవనాలను మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. నల్లమేకలపల్లి, సీతమ్మతండా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. రామకృష్ణాపురంలో పాత కమ్యూనిటీ భవనంలోనే పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అలేబాదుతండాలో పరిస్థితి దారుణంగా ఉంది. కొద్ది రోజులపాటు సర్పంచ్ చిన్న బాలూనాయక్‌కు చెందిన పాత ఇంటిలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహించారు. ప్రస్తుతం అందులో కూడా కార్యాలయం నిర్వహించడం లేదు. దీంతో అలేబాదుతండాలో పంచాయతీ కార్యాలయ భవనమే లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం స్పందించి కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లమేకలపల్లిలో పాఠశాల భవనంలో నిర్వహణ

ప్రతిపాదనలు పంపాం



సొంత భవనాలు లేని గ్రామ పంచాయతీల వివరాలను పంపించాల్సిందిగా ఇటీవల జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ప్యాపిలి మండలంలో కొత్తగా ఏర్పాటైన ఐదు గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేనట్లు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆయా పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు చేస్తే పనులు మొదలవుతాయి.

–బాలకృష్ణుడు, ఈఓఆర్డీ

పీ-4 సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో జరుగుతున్న పీ-4 సర్వేను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలను సర్వే చేశారు? ఇంకా ఎన్ని కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయి తదితర వివరాలను సర్వే బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. పీ-4 సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బనగానపల్లె కేజీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ నారాయణరెడ్డి ఉన్నారు.

సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యకరం



కూరగాయల ప్రదర్శనను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు ఆరోగ్యకరమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మండలంలోని గోసానిపల్లె గ్రామానికి చెందిన మహిళా రైతులు శ్రీదేవి, లలిత సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. సంప్రదాయ ఎరువులతో సాగు చేసే రైతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి సోమవారం రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, వెంకట్రాముడు, సుంకన్న, కోఆప్షన్ సభ్యుడు కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర షూటింగ్ బాల్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

కోవెలకుంట్ల: తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అంతర్ రాష్ట్రాల షూటింగ్ బాల్ పోటీల్లో కోవెలకుంట్ల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సెయింట్ జోసఫ్స్ పాఠశాల హెచ్‌ఎం గీతా తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీ నుంచి మూడో తేదీ వరకు జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 72 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. పాఠశాలకు చెందిన నాగ ఉదయ్, అనీఫ్, ప్రణయ్, నిఖిల్ జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పాల్గొన్నారన్నారు. ఆయా విభాగాల్లో రాణించి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. క్రీడాకారులను హెచ్‌ఎంతోపాటు ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఫిజికల్ డైరెక్టర్లు ఓబులేసు, హర్ష ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్నాను జయప్రదం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్యాపిలి: ఆశా వర్కర్లకు కనీస వేతనాల జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 6న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, ప్యాపిలి మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, చిన్న రహిమాన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జలదుర్గం పీహెచ్‌సీ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆశాలను ఉద్దేశించి మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనాలు అందించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆశాలను గుర్తించాలన్నారు. క్యాజువల్ లీవులు, రిటైర్మెంట్ వయసు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం వైద్యాధికారిణి సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లు చౌడేశ్వరి, శాంతకుమారి, దేవమ్మ, శంకరమ్మ, రేణుక, సరోజ, సుజాత, సరస్వతి పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి



ఆకుమల్లలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీడీ రమణయ్య

సంజామల: పాడిరైతులు పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ ఆళ్లగడ్డ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య అన్నారు. మంగళవారం సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో గాలికుంటు వ్యాక్సినేషన్ ప్రక్రియను పశుసంవర్ధక శాఖ ఏడీ మోహన్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. ఈ నెల 31వ తేదీ వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేస్తారని తెలిపారు. టీకాలు వేయించుకుని పాశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పశువైద్య సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశుఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి వెంట జేఈఓ వాసు, మహబూబ్ బేగ్ తదితరులు ఉన్నారు.

టీకాలతో పశువులకు రక్ష



అవుకులో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఏ హెచ్‌ఓ గోవింద నాయక్

అవుకు: టీకాలతో పశువులకు వివిధ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గోవింద నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అవుకు, గుండ్లశింగవరం గ్రామాల్లో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పశువుల పాకల వద్దకే వెళ్లి రైతులతో మాట్లాడారు. పశువైద్య సిబ్బంది సక్రమంగా టీకాలు వేస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం అవుకు, గుండ్లశింగవరం పశువైద్యశాలలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాడి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

బనగానపల్లె రూరల్: చిరుధాన్యాలతో చేయారు చేసిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు యోగాపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలైన రాగి, జొన్న, సజ్జ, కొర్ర తదితర ధాన్యాలతో తయారైన ఆహారాన్ని తీసుకోవాలని.. తద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు రక్తహీనత రాదన్నారు. అలాగే ప్రతి రోజు యోగా చేయాలని.. తద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఒత్తిడి దూరం అవుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మహిళలకు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, శైలజ, అవుకు, కోవెలకుంట్ల, బనగానపల్లె, కొలిమిగుండ్ల సంజామల మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

11న బహిరంగ వేలం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే పలు పనుల నిర్వహణకు ఈ నెల 11వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు తెలిపారు. సంతమార్కెట్ నిర్వహణకు ప్రాథమిక ధరావత్తు రూ. 3.50 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ. 3 లక్షలు, బస్టాండ్ పనులకు రూ. 3 లక్షలు, కమేళకు రూ. 8 వేలు ధరావత్తు నిర్ణయించామన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పొందిన సాల్వెన్సీ సర్టిఫికెట్ లేదా రూ. లక్ష అదనపు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వ్యక్తులు వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

డోన్ టౌన్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డోన్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్‌కే పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి సమాచారం మేరకు.. సంజామల మండలం బొందలదిన్నెకు చెందిన మధుమోహన్‌రెడ్డి, అతని మామ సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వస్తున్నారు. స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు జమ్మలమడుగు వైపు వెళుతూ బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్‌కు తగలడంతో ఇద్దరూ కిందపడి గాయపడ్డారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

కోవెలకుంట్ల: దివ్యాంగుల కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని ఆ సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగులకు పింఛన్ మినహా ఏఒక్క సంక్షేమ పథకం అందడం లేదన్నారు. త్వరితగతిన కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి తద్వారా దివ్యాంగులకు వివిధ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అంత్యోదయ కార్డులు, త్రీవీల్ స్కూటీలు, రాయితీ రైల్వే, బస్‌పాసులు, పక్కాగృహాలు, రుణాలు అందజేయాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: దొరపల్లె జగనన్న కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డోన్‌కు చెందిన ట్రాక్టర్ యు.కొత్తపల్లెలోని కంకర ఫ్యాక్టరీ నుంచి కంకర లోడుతో పట్టణానికి వెళుతోంది. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న పార్శల్ కంటైనర్ ట్రాక్టర్‌ను వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న కొండపేటకు చెందిన హమాలీ చలపతి (55) మృతిచెందాడు. మరో ముగ్గురు హమాలీలు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చలపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయం మార్పు

కోవెలకుంట్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయ నిర్వహణను గ్రామ సచివాలయంలోకి మార్పు చేసినట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.50 కోట్ల నిధులు కేటాయించిందని చెప్పారు. పాత భవనాన్ని కూల్చి వేసి కొత్త భవనాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కొత్త భవన నిర్మాణం పూర్తి అయ్యే వరకు పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి పక్కన ఉన్న ఐదో గ్రామ సచివాలయ భవనంలోకి కార్యాలయం మార్పు చేసినట్లు వెల్లడించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే మండల ప్రజలు ఈ మార్పును గమనించాలని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లపై భారీ జరిమానాలు దారుణం



డోన్‌లో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు,



కొలిమిగుండ్లలో..

డోన్ రూరల్: డ్రైవర్లకు భారీ జరిమానాలు పెంచే జీఓలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. సుంకయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేయడం, దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వత్తాసు పలకడం సరైందని కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు అన్వర్, అబ్బాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలపై జరుగుతున్న దాడులను ఆపాలి

కొలిమిగుండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చిన జీఓలతో ఆటోలపై వరుసగా దాడులు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారని.. తక్షణమే వాటిని ఆపాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఎంతో మంది ఆటోలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. జరిమానాలు విధించడం వల్ల కుటుంబాల పోషణ భారం అవుతుందన్నారు. గతంలో మాదిరిగా ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు మహేష్, కంబగిరి, రాజు, శ్రీరంగ, నాగరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు



నాటు సారాను చూపుతున్న సీఐ

డోన్ రూరల్: నాటుసారా విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ప్యాపిలి మండలం సిద్ధనగట్టు గ్రామంలో దాడి చేసి అలేబాద్‌తండా గ్రామానికి చెందిన ముధావత్ రాముడు నాయక్, హుసేనాపురం గ్రామానికి చెందిన గుండాల మల్లికార్జునను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 80 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఎస్‌ఐలు దౌలత్‌ఖాన్, సోమశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహించిన ఆత్మబంధువు సభ్యులు

డోన్: స్థానిక ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అనాథ శవానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రాథీయ బడాయిక్(40) కర్నూలు జిల్లా తుగ్గలి మండలం లింగనేనిదొడ్డి రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి సోమవారం మృతిచెందారు. అతని మరణ వార్త బంధువులకు తెలిపినా అంత్యక్రియలకు ముందుకు రాకపోవడంతో డోన్ జీఆర్‌పీ పోలీసుల కోరిక మేరకు సేవా సమితి సభ్యులు షాదిఖానరాజు, గురుస్వామి, కేరళ రఫీ తదితరులు హిందూ సంప్రదాయం ప్రకారం మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు.



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

సారారహిత గ్రామాలే లక్ష్యం

డోన్ రూరల్: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా ఎక్సైజ్ సిబ్బంది పనిచేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు.

ప్యాపిలి మండల పరిధిలోని అలేబాద్‌తండా గ్రామంలో మంగళవారం నవోదయ 2.0 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా తాగడం వల్లే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరామ నాయుడు, సీఐ వరలక్ష్మి, ఎక్సైజ్ ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, లక్ష్మణరావు, వీఆర్‌ఓ మహేష్, సర్పంచ్ వెంకటేష్‌నాయక్ ఉన్నారు.